# ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడలు నిర్వహిస్తాం



గురువారం మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు

## అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## త్వరలోనే ఎమ్మెల్యేలకు స్టడీ టూర్లు: మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

## ముగిసిన 2 రోజుల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల శిక్షణా కార్యక్రమాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** శాసనసభ్యులకు క్రీడలు నిర్వహించడం, స్టడీ టూర్ లకు పంపడం వంటి కార్యక్రమాలు జరుపుతామని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. శాసనసభ కార్య విధానం, కార్యక్రమ నిర్వహణ నియమావళిపై ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల అవగాహన సదస్సు ముగింపు కార్య క్రమం గురువారం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారి అధికారికంగా శాసన పరిషత్తు, శాసనసభ సభ్యులకు ఇలాంటి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శాసన వ్యవహారాలు తెలుసుకోవాలనే ఆసక్తితో సభ్యులు హాజరయ్యారు. చాలా సంతోషం. ఈ రెండు రోజుల ఓరియెంటేషన్ ప్రోగ్రాం ద్వారా శాసన పరిషత్తు, శాసనసభలలో హక్కులు, బాధ్యతలు తెలుసుకు న్నారని తెలిపారు. మనం ఎంత థియరీ నేర్చుకున్నా దానిని ప్రాక్టికల్ గా ఇంప్లిమెంట్ చేస్తేనే దానికి విలువ, నిజమైన గుర్తింపు అని పేర్కొన్నారు. తెలుసుకున్న విషయాలను వచ్చే సమావేశాలలో అమలు చేయడం ద్వారా సభ్యులకు మంచి పేరు వస్తుంది, గౌరవం పెరుగుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో శిక్షణ ఇచ్చిన పిఆర్ఎస్ రీసెర్చ్ ఇనిస్ట్యిటూట్ ఎక్స్ పర్ట్‌కు ధన్యవాదాలు తెలిపారు. సదస్సు నిర్వాహనకు సహకరించిన ఎంసిఆర్‌హెచ్ఆర్‌డి అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు ఈ సదస్సును విజయవంతం చేసిన లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన సదస్సులు తరచుగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త సంప్రదాయనికి నాంది పలికిందని, గతంలో ఎప్పుడు నిర్వహించని విధంగా ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు లేజిస్లేచర్ విధి విధానాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకున్నామన్నారు. ప్రభుత్వం సహకారం అందిస్తే త్వరలోనే అసెంబ్లీ, శాసన మండలి అన్ని కమిటీలను పూర్తి చేస్తామని తెలిపారు. త్వరలోనే స్టడీ టూర్‌లను కూడా ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహాచార్యులు, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశాంక్ గోయల్, లేజిస్లేచర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు 17 మంది, శాసనసభ సభ్యులు 61 మంది పాల్గొన్నారు.



# బాలామృతం ముడిసరకుల్లో నాణ్యత లోపాన్ని సహించేది లేదు

## మంత్రి సీతక్క హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** బాలామృతం ముడి సరుకుల్లో నాణ్యత లోపాన్ని సహించేది లేదని మంత్రి సీతక్క అధికారులను హెచ్చరించారు. గురువారం తెలంగాణ సచివాలయంలోని తన కార్యాలయంలో టిజి ఫుడ్స్‌పై మంత్రి సీతక్క అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఎ ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, తెలంగాణ ఫుడ్స్ అధికారులు హాజరు అయ్యారు. ఫుడ్ కార్పొరేషన్ పనితీరుపై మంత్రి సీతక్క అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు సొంత నిర్ణయాలు తీసుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించడం పట్ల మంత్రి సీతక్క అసహనం వ్యక్తం చేశారు. ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నా, తీరు మార్చు కోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులంతా పారదర్శకంగా వ్యవహరించాలని, నిస్పక్ష పాతంగా నిర్వహించాలన్నారు. కారుణ్య నియామకాలు, పదోన్నతుల్లో నిబంధనల ఉల్లంఘన జరగడం పట్ల ఆగ్రహం అయ్యారు. నాణ్యత లేని, శుభ్రత లేని సరుకులు సప్లై చేసిన కాంట్రాక్టర్లకు నోటీసువ్వాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు. అంగన్‌వాడి చిన్నారులకు సరఫరా చేసే బాల అమృతంను తయారీ చేస్తున్న టిజి ఫుడ్స్‌పై ఎంతో బాధ్యత ఉందన్నారు. బాల అమృతం ముడి సరుకుల్లో నాణ్యత లోపాన్ని సహించేది లేదన్నారు. నాసిరకం సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు, సహకరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తప్పులు జరిగితే చర్యలు తీసుకోండి, సస్పెండ్ చేయాలంటూ ఉన్నతాధికారులకు సూచించారు. ఒక టీం లాగా పనిచేయాలని, అంతా ఒక యూనిట్, ఆ యూనిట్‌లో అందరం భాగస్వాములం అవుతామన్నారు. టీం వర్క్ లాగా చేస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. అంగన్‌వాడి చిన్నారులకు ఆహారం సప్లై చేసే విభాగం లో ఉన్నామని, సరుకుల సప్లయర్స్‌తో రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. భువనగిరిలో బాలామృతం దారి మళ్లింపు ఘటనలో విచారణకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సమగ్ర విచారణ చేసి బాధ్యులను విధుల నుంచి తొలగించాలన్నారు. పబ్లిక్ నుంచి వచ్చిన వ్యక్తి ఫహీం ఆయన ఆదేశాలు పాటించండి, క్వాలిటీ మైంటైన్ చేయాలన్నారు. ప్రతీది రాతపూర్వకంగా నివేదిక ఇవ్వాలంటూ ఆదేశించారు. వాట్సాప్ మెసేజ్‌లతో పనులు కావన్నారు. దాపరికలు వద్దు, అవకతవకలకు పాల్పడే సప్లై కఠినంగా గమనించాలన్నారు. టెండర్లు పారదర్శకంగా నిర్వహించాలని, ఎవరికి కొమ్ము కాయాల్సిన అవసరం లేదన్నారు. ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలు విడనాడాలన్నారు. సమిష్టి నిర్ణయాలను పకడ్బందీగా అమలు చేయాలని, మీ తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూసుకోవాలని సూచించారు. లక్షల మంది చిన్నారుల భవితవ్యంతో కూడుకున్న అంశం, బాధ్యతతో విధులు నిర్వహించాలని, లేకపోతే విధుల నుంచి తొలగిస్తామని అన్నారు.

# ఐజెఎస్ఒ-2024 వేదికపై సత్తాచాటిన నారాయణ

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడిన ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్(ఐజేఎస్‌వో-2024)లో నారాయణ విద్యార్థులు అదరగొట్టారు. 2024 డిసెంబర్ 1 నుంచి 11వ తేది వరకు రొమేనియాలోని బుకారెస్ట్‌లో జరిగిన 21వ ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ ఫైనల్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి తమ అద్భుత ప్రతిభతో భవ్య గున్వాల్ మరియు శేతాంక్ అగర్వాల్ ఇరువురు గోల్డ్‌మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఐజేఎస్‌వో అనేది 16 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న విద్యార్థుల కోసం అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పోటీ. విద్యార్థులోలన శాస్త్రీయ జ్ఞానం మరియు అవగాహనను ప్రోత్సహించడం మరియు సైన్స్ పట్ల వారి ఆసక్తిని పెంపొందించడం ఐజేఎస్‌వో యొక్క ప్రధాన లక్ష్యం. పోటీలో పాల్గొనేవారు వారి సైద్ధాంతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు శాస్త్రాయ భావనలపై ఆచరణాత్మక అవగాహనపై పరీక్షించబడతారు. ఈ అద్భుత విజయం సాధించడం పట్ల నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ పి సింధూర నారాయణ మాట్లాడుతూ నారాయణ విద్యార్థులు సాధించిన ఈ ఘనవిజయం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. నారాయణ విద్యార్థుల అంకితభావం, పట్టుదల, కృషి మరియు సరైన మార్గదర్శకత్వం కారణంగా ఎలాంటి అద్భుతాలు సాధించవచ్చో మరోసారి నిరూపించారన్నారు. ఐజేఎస్‌వో 2024లో భవ్య మరియు శ్వేతాంక్ విజయం కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, ప్రపంచ వైజ్ఞానిక రంగాల్లో భారతదేశ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. వారి ప్రయాణంలో నారాయణ కీలక పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉందన్నారు. అలాగే ఈ విజయం పట్ల నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి శరణినారాయణ తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ఉత్సుకతను పెంపొందించడం ఆవిష్కరణల వైపు నడిపించడం మరియు ఏదైనా ఆసక్తిగల రంగాలలో రాణించగల నైపుణ్యాలతో నారాయణ విద్యార్థులను సన్నద్ధం చేయడానికి నారాయణ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఐజేఎస్‌వోలో నారాయణ విద్యార్థులు సాధించిన విజయాలు పెద్ద కలలు కనే ప్రతి విద్యార్థికి స్ఫూర్తినిస్తాయన్నారు. ఈ ఘనత నారాయణ కుటుంబానికి, యావత్ భాతర దేశానికి మధురైన క్షణాలుగా అభివర్ణించారు. ఘనతసాధించిన వారికి వెన్నుదన్నుగా నిలిచిన తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకి నారాయణ విద్యా సంస్థల ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కె పునిత్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

# రెండు సెట్స్ కన్వీనర్ల మార్పు?

## సెట్స్ నిర్వహణపై ఉన్నత విద్యామండలి కసరత్తు షురూ

## కన్వీనర్లను ఎంపిక చేయాలంటూ విసిలకు లేఖలు

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ పరీక్షలపై తెలంగాణ ఉన్నత విద్యా మండలి కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రం లో నిర్వహించే ఎప్‌సెట్, ఎడ్ సెట్, ఐ సెట్, లాసెట్, పీజీ లాసెట్, ఈ సెట్, పీజీఈసెట్, పీఈసెట్‌ల నిర్వహణపై ఉన్నత విద్యా మండలి కసరత్తును ప్రారంభించింది. 2025-26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్‌లను వచ్చే ఏడాది ఏప్రిల్, మే చివరి నాటికే పూర్తి చేయాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. అందులో భాగంగా వివిధ సెట్స్‌ను నిర్వహించే యూనివర్సిటీలకి కన్వీనర్లను ఎంపిక చేయాలని పేర్కొంటూ ఉన్నత విద్యా మండలి లేఖలను రాసినట్టు తెలుస్తోంది. కన్వీనర్ల కోసం యూనివర్సిటీ నుంచి వచ్చే ప్రతిపాదనల ఆధారంగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ కన్వీనర్లను ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో ముందుగానే కన్వీనర్లను ఎంపిక చేసుకుంటే.. అందుకు సంబంధించిన పనులను ప్రారంభిం చడానికి అవకాశం ఉంటుందని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. ఈ ఏడాది నిర్వహించిన సెట్స్‌లో రెండు సెట్స్‌కి వచ్చే ఏడాది కన్వీనర్లు మారే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా ఐ సెట్ కన్వీనర్ మారే అవకాశం ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఐ సెట్ కన్వీనర్‌గా నియమించిన వ్యక్తిపై యూనివర్సిటీ నుంచి కొంత వ్యతిరేకత వ్యక్తం అయినప్పటికీ.. అప్పటి వీసీ తాము సూచించిన వ్యక్తి కాకుండా వేరే వారిని ఎవరిని నియమిస్తారో నియమించండి అంటూ ఉన్నత విద్యా మండలిని ప్రశ్నించడంతో.. తప్పనిసరి పరిస్థితుల్లో ఐ సెట్ కన్వీనర్ నియామకం జరిగింది. అయితే వచ్చే ఏడాది నిర్వహించే ఐ సెట్-2025 కన్వీనర్ మారే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. దాంతోపాటు ఎక్కువ మంది హాజరయ్యే ఎప్ సెట్(ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) కన్వీనర్ కూడా మారే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది ఎపన సెట్‌ను గత కొన్ని సంవత్సరాలుగా జేఎన్‌టీయూ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు

## ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు, గ్రామస్థులు

## వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్

**ధారూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త:** కీచకుడికి మారు పేరుగా కిష్టయ్యను పోల్చవచ్చు. గతంలో పలుమార్లు ఇలాంటి ఘటనలు జరిగినా బుద్ధి మారలేదు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఇలాంటి ఘటనలు అతడు పరిపాటిగా చేస్తుం టాడు. ప్రభుత్వాలు, అధికారులు ఆ కీచక ఉపాధ్యాయుడుకి అండగా ఉండటంతో బయటికి వచ్చేయడం.. యధావిధిగా విధులు నిర్వహిం చడం ఉపాధ్యాయుడు కిష్టయ్యకు షరా మామూ లైంది. వెంటనే ఆ ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ధారూ రు మండల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి విద్యా ర్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండలం ధారూర్ స్టేషన్ ప్రాథమిక ఉన్నత పాఠ శాలలో(యుపిఎస్) తెలుగు ఉపాధ్యాయుడిగా నవాబు పేట్ మండలానికి చెందిన కిష్టయ్య విధులు నిర్వ హిస్తున్నాడు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు కిష్టయ్య కొంతకాలంగా అసభ్యంగా వ్యవహరి స్తున్నాడు. వెకిలి చేష్టలతో విద్యార్థినులను తాక కూడని చోట నిమరడం వంటివి చేస్తున్నాడు. ఈ ఉపాధ్యాయుడు వెకిలి చేష్టలు, వేధింపులు భరిం చలేక విద్యార్థినులు ఇంటికి వెళ్లి వారి తల్లిదం డ్రులకు విషయం తెలియ జేశారు. బాధిత విద్యా ర్థిని తల్లిదండ్రులు, గ్రా మానికి చెందిన యువ కులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడు కిష్టయ్య ను నిలదీశారు. దీంతో కిష్టయ్య అక్కడి నుంచి జారుకున్నాడు. ఉపాధ్యా యుడిని కఠినంగా శిక్షించాలని, వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులు, గ్రామస్తులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు.



బాధిత విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఇఒ శ్రీనివాస్‌రెడ్డి

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా : ఎంఇఒ శ్రీనివాస్‌రెడ్డి**

పాఠశాల వద్ద ఆందోళన జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అక్కడికి చేరుకుని విద్యార్థుల తండ్రులు, గ్రామ స్తులతో మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం సరైందికాదని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి ఉపాధ్యా యుడిపై తగు చర్యలు తీసుకునేలా తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# వచ్చే యేడాది మరో ఆరు ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల అప్‌గ్రేడ్

## ప్రభుత్వానికి సాంకేతిక విద్యాశాఖ ప్రతిపాదనలు

## ప్రభుత్వ అనుమతి తర్వాత ఎఐసిటిఇ అనుమతి కోరనున్న సర్కారు

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే ఏడాది మరో 6 ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలుగా కొనసాగుతున్న ఆరింటిని ఇంజనీరింగ్ కాలేజీలుగా ఉన్నతీకరించడానికి రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ప్రభుత్వం అనుమతిస్తే వచ్చే ఏడాది 2025-26 విద్యా సంవత్సరం నుంచి సంబంధిత 6 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు ఇంజనీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయితే ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫైల్‌ను విద్యాశాఖ అనుమతించగా.. ఆర్థిక శాఖ అనుమతి కోసం పంపించినట్టు తెలుస్తోంది. ఆర్థిక శాఖ అనుమతి అనంతరం ప్రభుత్వం ఆయా 6 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను ఇంజనీరింగ్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయనుంది. ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన అనంతరం.. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) అనుమతి కోరుతూ ప్రభుత్వం లేఖ రాయాల్సి ఉంటుంది. ఏఐసీటీఈ అనుమతి వస్తే వచ్చే ఏడాది ఆయా కాలేజీల్లో ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లను తీసుకుంటారు. అయితే ఇంజనీరింగ్ కాలేజీలుగా మారున్న 6 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు కూడా జీహెచ్ఎంసీ పరిధిలోని కావడం విశేషం. రాష్ట్రంలో తొలిసారిగా ప్రస్తుత విద్యా సంవత్సరం 2024-25లో కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా ఉన్నతీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం మరో ఆరింటిని అప్‌గ్రేడ్ చేయనుంది. రాష్ట్రంలో 57 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లుండగా.. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనే 12 కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని సికింద్రాబాద్ ఈస్ట్ మారేడుపల్లిలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ (జీఐవోఈ), మహిళా పాలిటెక్నిక్ కళాశాల, రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, బహదూర్‌పురలోని కులీకుతుబ్‌షా పాలిటెక్నిక్, అమీర్‌పేటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్(మహిళలు). అలాగే బడంగ్‌పేట పాలిటెక్నిక్ కాలేజీ(మహిళ, మైనారిటీ)లను ఇంజనీరింగ్ కళాశాలలుగా ఉన్నతీకరించ నున్నారు. జీఐవోఈలో ఎలక్ట్రానిక్స్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్ మరియు మారేడ్‌పల్లి పాలిటెక్నిక్‌లలో సీఎస్ఈ, రామంతపూర్ పాలిటెక్నిక్‌లో సివిల్ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టడానికి అనుమతి కోరుతూ ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో వచ్చే ఏడాది ఈ కోర్సులను ఆయా కాలేజీల్లో ప్రారంభించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

# మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించకుంటే అంతుచూస్తాం

## బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 12, ప్రభాతవార్త:** మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించకపోతే లక్షలాదిమంది బిసిలతో పెరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వం అంతుచూస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మంత్రి వర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించకపోవడం వల్ల పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని, సిఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిడికెడు మంది లేని రెడ్డి, వెలమ సామాజికవర్గాలకు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికంగా మంత్రి పదవులు కట్టబెట్టిందని, ఆ విధంగా కా ంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. మంత్రి వర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి లేఖ రాస్తామన్నారు.

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెలమ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మంత్రిపదవి ఇవ్వాలని కోరడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎక్సైజ్ శాఖ గౌడ సామాజిక వర్గానికి, చేనేత, జౌళి శాఖలు పద్మశాలి సామాజిక వర్గాలకు కేటాయించాలని కోరారు. సమావేశంలో బిసి నేతలు బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, కుందారం గణేషాచారి, ఐయిలి వెంకన్నగౌడ్, యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఓపెన్ స్కూల్ సొసైటీలో టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు 16వ తేదీకి పెంపు

## ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ శ్రీహరి

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్‌లో చేరడానికి అడ్మిషన్ల గడువును పొడిగించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్‌లో చేరడానికి ఈ నెల 16 వరకు అవకాశం కల్పిం చినట్టు ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ పీవీ శ్రీహరి గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను ఈ నెల 16 లోగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అడ్మిషన్లకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలన్నారు. అడ్మిషన్లను ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ నెల 17లోపుగా వారు చేరాలనుకున్న స్కూల్, కాలేజీల్లో వారికి అడ్మిషన్లకు సంబంధించిన అర్హత పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని డైరెక్టర్ శ్రీహరి స్పష్టం చేశారు.

# ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలి

## కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్‌మేఘ్‌వాల్‌కు ఉపాధ్యాయుల వినతి

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెగ్వాల్‌ని కలిసిన తమకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలి ఉపాధ్యాయులు గురువారం ఢిల్లీలో వినతిపత్రం సమర్పించారు. ప్రా థమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌లో ఓటు హక్కు సాధన కోసం కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెగ్వాల్‌ని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన భీమనబోయిన కృష్ణమూర్తి, నల్గొండ జిల్లాకు చెందిన కర్నాటి శరత్ బాబు ఉస్మానియా యూనివర్సిటీ బీసీ నేత చెన్న శ్రీకాంత్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే క్యాబినెట్‌లో చర్చించి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ విషయంపై వివరణ గురించి మంత్రి గారితో చర్చించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీలో ఓటు హక్కు కల్పించడం కోసం చేయవలసినటువంటి చట్టపరమైన రాజ్యాంగ పరమైనటువంటి అంశాలని పరిశీలించి క్యాబినెట్ లో చర్చించి రాజ్యాంగ సవరణ చేయడం ద్వారా అతి త్వరలో వివిధ రాష్ట్రాల్లో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్ టీచర్స్‌కు ఓటు హక్కు కల్పిస్తామని కేంద్ర న్యాయశాఖ మంత్రి హామీ ఇవ్వడం జరిగిందనీ ఉపాధ్యాయుడు బి కృష్ణమూర్తి తెలిపారు.

# అప్‌గ్రేడేషన్ కారణంగా నాలుగు రోజులు ధరణి సేవలు బంద్

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజుల పాటు ధరణి పోర్టల్ సేవలు బంద్ కానున్నాయి. డేటా బేస్ వెర్షన్ అప్ గ్రేడ్ జరుగుతున్న నేపథ్యంలో నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి అపగ్రేడేషన్ ప్రారంభం కాగా, సోమవారం అంటే ఈనెల 16వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. దీంతో ఈ నాలుగు రోజుల పాటు ధరణి సేవలు అందుబాటులో ఉండవు. కాగా, గత మూడు రోజులుగా ధరణి సేవలు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఓటిపిలు రావడం లేదని మీ సేవా నిర్వాహకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు రెండు రోజుల పాటు ధరణి పోర్టల్ ద్వారా కేవలం సేల్ డీడ్ మాత్రమే అయ్యాయి. టీఎం 33, గిఫ్ట్ డీడ్స్ వంటి మాడ్యూల్స్ పనిచేయలేదు. మధ్యమధ్యలో సైట్ లోడింగ్ అని చూపించింది. టెర్రాసిస్ సృష్టించిన సాఫ్ట్‌వేర్, పోర్టల్‌ని యధాతథంగా వాడటం ద్వారా అనేక సమస్యలు తలెత్తుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ధరణి పోర్టల్‌లో 35 మాడ్యూళ్లతో గందరగోళం నెలకొన్నది. దీన్ని సరళీకృతం చేసే పనిని ఎంతగా చేపట్టినా సాంకేతిక సమస్యలు తలెత్తుతు న్నాయని సమాచారం. తక్కువ మాడ్యుల్స్‌తోనే రైతులకు సేవలం దించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏ సమస్య ఉన్నా ఒక్క మాడ్యుల్ కిందనే దరఖాస్తు చేసుకునే వెలుబాటును తీసుకురాను న్నారు. ఐతే టెర్రాసిస్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను చేపట్టిన ఎన్ఐసీకి కూడా తలనొప్పిగా మారిందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

# బిజెపికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

## ఎమ్మెల్సీ కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 12:** బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బయ్యారంలో లక్షా 41 వేలకు పైగా ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకుపైగా ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నాయని చెనప్పారు. అక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరుగుతాయి అన్నది కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉందని, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టాన్ని మాత్రం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్రంలో పదేండ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ హామీని అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని వెల్లడించారు. ఐరన్ ఓర్ నాణ్యత నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వం సాకు చూపిస్తున్నదని విమర్శించారు. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కావడానికి అవసరమైన మరో 100 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్‌ను ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకువచ్చేందుకు కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కేసీఆర్ మాట్లాడారని చెప్పారు. బీజేపీకి తెలంగాణ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి, ప్రేమ ఉన్నా తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కాదని పార్లమెంటు సాక్షిగా తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించడం బాధాకరమన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్కరు కూడా స్పందించకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఉక్కు పరిశ్రమ కోసం డిమాండ్ చేశారని, ఇప్పుడు మాత్రం మాట్లాడటం లేదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయించాలన్నారు.

